క్లుప్తంగా

జానపద నృత్యంలో శివపార్వతి ప్రతిభ

కంభం: మైనంపాడు డైట్ కళాశాలలో కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి రంగోత్సవ్ పోటీల్లో జానపద నృత్య విభాగంలో యర్రబాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏరువ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలి

రాచర్ల: గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈ ఎన్వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలో చోళ్లవీడు, రంగారెడ్డిపల్లె, యడవల్లి గ్రామాల్లో సీసీ రోడ్లను మంగళవారం పరిశీలించారు. ఆయన వెంట గిద్దలూరు, రాచర్ల పంచాయతీరాజ్ ఏఈలు సుబ్బారావు, రంగస్వామిరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి


బేస్తవారిపేట : మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆనందకుమారి

బేస్తవారిపేట: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం ఆర్.ఆనంద కుమారి సూచించారు. మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో వయోజన విద్యా కార్యక్రమం వలంటీర్లకు శిక్షణ ఇచ్చారు. బేస్తవారిపేట మండలంలోని అక్కపల్లె, బసినేపల్లెలో 652 మంది నిరక్షరాస్యులను గుర్తించి 10 మందికి ఒక విద్యా వలంటీర్‌ను నియమించినట్లు తెలిపారు. అంకిత భావంతో పనిచేసి నిరక్ష్యరాస్యత తగ్గించేందుకు కృషి చేయాలని సూచించారు. వయోజన విద్య అభ్యసన పుస్తకాలు, నోట్‌బుక్‌లు, పెన్నులు, బోర్డుల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వయోజన విద్య సూపర్‌వైజర్ చౌడిరెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలి


విద్యుత్ సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

గిద్దలూరు రూరల్: విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలని విజయవాడకు చెందిన సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ సూచించారు. సీజీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని వితా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం మార్కాపురం డివిజన్ స్థాయి విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాపై అధికారులు బాధ్యతగా పనిచేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యలు, బిల్లుల విషయంలో లోటుపాట్లను సదస్సులో తెలియజేయాలని కోరారు. లో వోల్టేజి సమస్య, బిల్లు ఎక్కువగా రావడం తదితర సమస్యలపై మొత్తం 35 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె.వెంకటకృష్ణ, ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, ఎ.సునీత, సూపరింటెండెంట్ ఇంజినీర్ కట్టా వెంకటేశ్వరరావు, మార్కాపురం ఈఈ పి.వి.నాగేశ్వరరావు, గిద్దలూరు డీఈ డి.వై.శేషగిరిరావు, మార్కాపురం డీఈ సియానాయక్, ఏఈలు పాల్గొన్నారు.

రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

సాక్షి నెట్‌వర్క్: రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇస్తామని ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రాయవరం, చింతగుంట్ల గ్రామాల్లో కంది, శనగ పంటలను ఆయన పరిశీలించారు. రైతులు పంట నమోదుతో పాటుగా ఈ–కెవైసీ చేయించుకుంటే గుర్తింపు సంఖ్య ఇస్తామన్నారు.

✦ తర్లుపాడు మండంలోని రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం అవుతుందని ఏఓ వెంకటేశ్వర్లు తెలిపారు. లక్ష్మక్కపల్లి, కొండారెడ్డిపల్లిలో ఉద్యానవన అధికారి రమేష్, సిబ్బందితో కలిసి పంటలను పరిశీలించారు.

✦ ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు అందజేస్తున్నట్లు బేస్తవారిపేట ఉద్యానశాఖ అధికారి డి.శ్వేత తెలిపారు. చింతలపాలెం, నేకునాంబాద్‌లో రైతులకు సబ్సిడీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

✦ రైతులు వ్యవసాయంలో సాంకేతికతను వినియోగించాలని గిద్దలూరు ఏఓ విజయ భాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కంచిపల్లెలో రైతులకు పంటల సంరక్షణ యాప్‌పై అవగాహన కల్పించారు. ఫార్మర్ రిజిస్ట్రీ గురించి వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

✦ ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రత్యేక ఐడీ నంబర్ పొందాలని కొమరోలు ఏఓ రాజశ్రీ తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని రైతులు సంప్రదించాలని సూచించారు.





బేస్తవారిపేటలో స.హ చట్టం బోర్డు లేని వెలుగు కార్యాలయం, హౌసింగ్ ఏఈ ఆఫీస్, విద్యుత్ శాఖ కార్యాలయం, ఉపాధి హామీ కార్యాలయం

సమాచారం.. బహు దూరం!

- ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసేది ఒకరు.. స.హ చట్టం బోర్డులో వేరొకరి పేరు
- బొత్తిగా కానరాని సమాచార హక్కు నోటీస్ బోర్డులు
- ఉద్దేశపూర్వకంగానే ఏర్పాటు చేయడం లేదని ఆరోపణలు
- చట్టంపై అవగాహన కల్పించడంలోనూ అధికారుల నిర్లక్ష్యం
- అడిగిన పూర్తి సమాచారం ఇవ్వడం లేదని అర్జీదారుల ఆగ్రహం

బేస్తవారిపేట:

ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకత, బాధ్యతను పెంచడానికి దోహదపడే అస్త్రం సమాచార హక్కు చట్టం. అలాంటి చట్టాన్ని గిద్దలూరు నియోజవర్గ ప్రజలు సక్రమంగా వినియోగించుకోకుండా చేసేందుకు కొందరు అధికారులు పరోక్షంగా అడ్డుతగులుతున్నారు. చట్టంపై అవగాహన కల్పించాల్సిన వారే చిన్నచూపు చూస్తుండటంతో ప్రజలు తమకు అవసరమైన పూర్తి సమాచారం పొందడం గగనంగా మారింది.

ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఎక్కడ?

సమాచార హక్కు చట్టం 2005 మే 11వ తేదీన అమల్లోకి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణ, సంక్షేమ పథకాల్లో అవకతవకలను నియంత్రించేందుకు స.హ చట్టం ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ఆయా కార్యాలయాల్లో సమాచారహక్కు చట్టం బోర్డులు మచ్చుకైనా కానపడటంలేదు. ఈ బోర్డుల్లో ఆయా కార్యాలయాల్లోని అప్పిలేట్ అధికారి పేరు, ఫోన్ నంబర్ పేర్కొనాల్సి ఉన్నప్పటికీ ఆయా శాఖల అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదు. కొన్ని కార్యాలయాల్లో చట్టం అమల్లోకి వచ్చినప్పుడు ఏర్పాటు చేసిన బోర్డులే నేటికీ దర్శనమిస్తున్నాయి. కార్యాలయ అధికారి బదిలీ అయినపుడు ఆ స్థానంలో కొత్తగా వచ్చినవారి పేరు ఇతర వివరాలను మార్పు చేయకుండా అలాగే వదిలేస్తున్నారు. బేస్తవారిపేటలో ఎంపీడీఓ కార్యాలయం, హౌసింగ్ ఏఈ, విద్యుత్‌శాఖ ఏఈ, ఐసీడీఎస్, వెలుగు కార్యాలయాల్లో, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు లేవు. వ్యవసాయశాఖ ఏఓ కార్యాలయంలో పాత బోర్డు ఉంది, సహాయ పౌర సమాచార అధికారిగా ఐదేళ్ల క్రితం బదిలీపై వెళ్లిన ఏఈఓ సరస్వతి పేరు నేటికీ ఉంది.


బేస్తవారిపేట వ్యవసాయశాఖ కార్యాలయంలో ఉన్న పాత బోర్డు


కంభం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు వెతుకుతున్న అర్జీదారుడు



కంభం ఎంఈవో కార్యాలయంలో బదిలీ అయిన అధికారుల పేర్లతో దర్శనిమిస్తున్న బోర్డు

అర్జీదారులకు అందని సమాచారం

కంభం: మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు బోర్డుల్లో అధికారుల సమాచారం ఉండటం లేదు. విద్యాశాఖ, మండల పరిషత్ కార్యాలయాల్లో నేటికీ బదిలీ అయి వెళ్లిపోయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆ చట్టం ఒకటి ఉందన్న విషయం చాలా మందికి నేటి వరకు తెలియని పరిస్థితి. అడిగిన పూర్తి వివరాలు ఇవ్వకుండా అరకొరగా సమాచారం ఇస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అడిగిన సమాచారం ఇవ్వకుండా రాజకీయ నాయకులు, ఇతరులతో సర్దిచెప్పించి చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలున్నాయి.

ప్రజలకు అవగాహన కల్పించాలి


ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. నేటికీ కొందరికి మాత్రమే ఈ చట్టంపై అవగాహన ఉంది. ప్రజలందరూ సమాచార హక్కు చట్టం పై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలి. అదే విధంగా అధికారులు సైతం దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో అందించాలి.
– పి.లావణ్య, అడ్వకేట్

అవినీతి జరిగితే నిలదీసే ఆవకాశం ఉంటుంది


ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి పనులు, పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా సమాజంలో ప్రతి ఒక్కరూ తెలుసుకునే వీలుంటుంది. ఎక్కడైనా అవినీతి జరిగితే ఈ చట్టం ద్వారా తెలుసుకుని ప్రశ్నించే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ ఈ చట్టంపై అవగాహన కలిగి ఉంటే మంచిది.
– బి.ఐజాక్, అడ్వకేట్ , కంభం

అడిగిన పూర్తి సమాచారం ఇవ్వడం లేదు


వెలుగు శాఖలో సిబ్బంది విధులు, పదవీ కాలం, బదిలీలకు సంబంధించిన వివరాలు కావాలని సమాచార హక్కు చట్టం ద్వారా సంబంధిత అధికారులకు దరఖాస్తు చేశా. నేను అడిగిన పూర్తి సమాచారం ఇవ్వకుండా అరకొర సమాచారం ఇచ్చి చేతులు దులుపుకొంటుటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలి.
– మహమ్మద్ ఇబ్రహీం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

అవినీతి వెలుగులోకి వస్తుందనే..

సమాచార హక్కు చట్టంపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తే తమ లొసుగులు బట్టబయలవుతాయని కొందరు అధికారుల్లో అలజడి నెలకొంది. మరోవైపు ఎక్కడ పని భారం పెరుగుతుందోననే ఉద్దేశంతో పలువురు అధికారులు ఈ చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు. సమాచార హక్కు చట్టం కింద కావాల్సిన సమాచారం కోరుతూ దరఖాస్తు చేసుకున్నవారికి శాఖల వారిగా నిర్ణీత కాలంలో అడిగిన పూర్తి స్థాయి సమాచారాన్ని ఇవ్వాలి. ఈ పరిణామాలన్నీ అధికారులకు ఇబ్బందులు కలిగిస్తాయని అందుకే ఈ చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకరావడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారాన్ని కోరే దరఖాస్తు ఫారాలు సైతం అందుబాటులో ఉంచడం లేదు.

దేశాభివృద్ధిలో యువత కీలకం


వ్యాసరచన పోటీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

– సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

మార్కాపురం: దేశాభివృద్ధిలో యువత పాత్రే కీలకమని సబ్‌కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలోని సాధనా డిగ్రీ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలను కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలన్నారు. తహసీల్దార్ చిరంజీవి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూదన్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.శేషుకుమార్, అకడమిక్ ఇన్‌చార్జి ప్రసాద్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ఇన్‌చార్జి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల ఆర్థికాభివృద్ధి


విద్యా వలంటీర్లకు ఉల్లాస్ పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఖాశింబి

రాచర్ల: సమాజంలో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని ఎంపీపీ షేక్.ఖాశింబి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ×ఉల్లాస్∗ వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కుటుంబంలో చదువుకున్న మహిళ ఉంటే ఆ కుటుంబం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. చదువుతోనే సమాజంలో పరిస్థితులపై అవగాహన ఉంటుందని చెప్పారు. నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పించేందుకు నిర్వహించనున్న ఉల్లాస్‌లో శిక్షణ ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన విద్యా వలంటీర్లకు మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఎంఈవోలు గిరిధర్‌శర్మ, కోటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎం రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియపై అవగాహన అవసరం


గిద్దలూరు : వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అధికారులు

గిద్దలూరు రూరల్: ఓటింగ్ ప్రక్రియపై ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారావు, పాఠశాల హెచ్‌ఎం నాగభూషణ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్త్ పెన్షన్ల తనిఖీ


కొమరోలు : పింఛను లబ్ధిదారులను పరిశీలిస్తున్న వైద్య బృందం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో హెల్త్ పెన్షన్లను మంగళవారం పునఃపరిశీలించినట్లు కమిషనర్ నారాయణరావు తెలిపారు. ప్రత్యేక వైద్యాధికారుల బృందం 21 సచివాలయాల పరిధిలోని 17 మంది హెల్త్ పెన్షనర్ల ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితిని తనిఖీ చేశారని చెప్పారు. తనిఖీల్లో డాక్టర్ జి హవీలా, డాక్టర్ టి.వైద్యసంజీవ్, రోహిత్ నాయక్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు, చింతగుంట, వెలిగండ్ల, మునగపాడు, కొనకనమిట్ల, సిద్ధవరం గ్రామాల్లో దివ్యాంగ పింఛనర్ల సర్టిఫికెట్లను వైద్యులు మంగళవారం పరిశీలించారు. తనిఖీ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ తెలిపారు. వైద్యాధికారి ఎస్వీ బాలయ్య, ఈఓపీఆర్డీ శ్రీదేవి, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


కొనకనమిట్ల : సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు


పింఛన్లను తనిఖీ చేస్తున్న వైద్య బృందం

కొమరోలు : మండలంలో రూ.15 వేలు పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల అర్హతను వైద్యులతో కూడిన అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. అల్లినగరం, బ్రాహ్మణపల్లె, కొమరోలు, చింతలపల్లి గ్రామాల్లో 24 మంది ఇళ్లను వైద్య బృందం తనిఖీ చేసింది. ఎంపీడీఓ మస్తాన్‌వలి మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 46 మంది రూ.15 వేల పింఛను పొందుతున్నారని తెలిపారు. బుధవారం మరో 22 మందిని పరీక్షించనున్నట్లు చెప్పారు. తనిఖీ బృందంలో డాక్టర్ బి.హర్ష, డాక్టర్ విజయ్‌చంద్ర, డాక్టర్ చైతన్య దీపక్ ఉన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఈ.పి. 9/2020, ఓ.ఎస్. 26/2013
షేక్ రసూల్ సాహెబ్
(చనిపోయిన వందున వారసులు)
షేక్ అన్వర్ హుస్సేన్ వగైరా. ... పిటిషనర్లు.
వర్సెస్
తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ... రెస్పాండెంట్.
పై నెంబరు ఈ.పి. లో యిస్తిహారు జారి కాబడిన పై నెంబరు రెస్పాండెంట్ తాలూకు క్రింది షెడ్యూలు దాఖలా భూమిని వేలం వేయుటకు శ్రీ కోర్టు వారు ది.15-02-2025 కి వాయిదా వేసినారు. కావున వేలం పాటలో పాల్గొనదల్చినవారు వాయిదా రోజున ఉదయం 10-30 నిమిషములకు పైకోర్టు వారి ఎదుట హాజరై వేలంపాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును. కోర్టు వారి షరతులకు లోబడి పాట జరుగును.
షెడ్యూలు : ప్రకాశం జిల్లా, ఒంగోలు రి.డి, మార్కాపురం సబ్ .రి.డి, మార్కాపురం మండలం, చింతగుంట్ల గ్రామ సర్వే నెంబర్ 409 లో య. 0-46 మరియు సర్వేనెంబర్ 410/1 లో య.3-24. మొత్తం విరతి య. 3-70 సెంట్లు ఏక ఖండంగా ఉన్నటువంటి వాటి హద్దులు. తూర్పు : పచ్చా నరసయ్య భూమి, దక్షిణం : రస్తా, పడమర : రస్తా, ఉత్తరం : కందుల ఈశ్వర్ రెడ్డి భూమి.
ఈ హద్దులలోని బోరు బావి ఎలక్ట్రికల్ మోటారు కనెక్షన్ కలిగిన య. 3-70 సెంట్ల భూమి. పైది య. 2-00 సెంట్లు భూమి మాత్రం.
(కోర్టు వారి ఉత్తర్వులతో)
డి.హెచ్. ఆర్.విలువ రూ 4,00,000
మార్కెట్ విలువ రూ 4,68,000
వేలం వాయిదా ది. 15-02-2025
ఫర్దర్ హియరింగ్ ది. 24-02-2025
నోట్ – ఈ.సి. దాఖలా డి.హెచ్.ఆర్. షేక్ రసూల్ సాహెబ్ పేరున గల మార్టిగేజ్ తనఖా డాక్యుమెంట్ నెంబర్ 16/2021. ఎస్.ఆర్.ఓ. మార్కాపురంకు లోబడి వేలం జరుగును.
సయ్యద్ అలీ జహీర్, అడ్వకేట్, మార్కాపూర్
సెల్ : 9490281499.

కంభం చిత్ర కళాకారులకు బహుమతులు


అవార్డు అందుకుంటున్న చిత్ర కళాకారులు

కంభం: డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కోనసీమ చిత్రకళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించిన 35వ అంతర్జాతీయ స్థాయి చిత్రకళా పోటీల్లో కంభం పట్టణానికి చెందిన చిత్ర కళాకారులకు బహుమతులు దక్కాయి. పఠాన్, ఖాసిం వేసిన సీల్డ్ లైఫ్ పెయింటింగ్‌కు ఇంటర్నేషనల్ మెగా బ్రహ్మోత్సవం అవార్డు, ఎం.రాజశేఖర్‌రాజు వేసిన లేడీ ఇన్ ద మిర్రర్ పెయింటింగ్‌కు బ్రహ్మోత్సవ ప్రతినిధి అవార్డు దక్కాయి. అన్నం విజయకుమార్ వేసిన ది లయన్ చిత్రాన్ని ఇంటర్నేషనల్ చిత్రకళ గోల్డెన్ పద్మ అవార్డు వరించింది. ఈ అవార్డులను కోనసీమ చిత్రకళాపరిషత్ వ్యవస్థాపకుడు కొరసాల సీతారామస్వామి, అమలాపురం ఎంపీ ఆనందరావు, ఎమ్మెల్యే మాధవీ చేతుల మీదుగా అందజేశారు.